జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.


epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 31-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 553 పేజీలు: 4 వెల : రూ.7





# ముక్కోటి శోభ

* వైష్ణవ ఆలయాలకు పోటెత్తిన భక్తులు
* ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారి దర్శనం
* భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు

శ్రీకాకుళం, డిసెంబరు30(వార్త): వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లాలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడింది. ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు, కమిటీలు, ఆలయాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని నారాయణ తిరుమల, శివబాలాజీ తదితర విష్ణు ఆలయాలతో పాటు జగన్నాథ స్వామి ఆలయం, అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి, శ్రీకూర్మంలోని కూర్మనాథుని ఆలయం రద్దీగా మారింది. అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 5:30 గంటల నుంచే భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై అధిష్ఠింపజేసి, గ్రామ వీధుల్లో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ స్వామి వారి ఊరేగింపు నయనానందకరంగా సాగింది. ఉషా, పద్మిని, ఛాయా సమేత సూర్యనారాయణ స్వామి వారికి ప్రత్యేకంగా పుష్య శుద్ధ ఏకాదశి కళ్యాణం నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ప్రసాద్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.



## వాసుదేవుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

మందస, డిసెంబరు 30(వార్త): వాసుదేవస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం స్వామివారిని ఉత్తరద్వారం దర్శించుకునేందుకు భక్యుతలు క్యూ కట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో వేకువ జామున స్వామివారిని తిరువీధుల ప్రదక్షణకావించి, ఉత్తర ద్వారం నుంచి తీసుకెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. లావేరు మండలం నుంచి భక్తబృందం హరేరామ, హరేకృష్ణ సంకీర్తనలనాలపించారు. ఆండాళ్లగోష్టి, శ్రీవాసుదేవ సేవాసమితి, భక్తులు, మందస యువత సేవలందించారు. కార్యక్రమంలో అర్చకులు సచ్చిదానందపాడి, సంతోష్ పాండే, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా చేసుకోండి

* ఈవెంట్ల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరి * అనుమతుల్లేకుండా నిర్వహిస్తే చర్యలు * డీజేలు నిషేధం
* సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం, డిసెంబరు30(వార్త): జిల్లాలో ఈనెల 31న రాత్రి, జనవరి 1న నూతన సంవత్సరం వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా చేసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో ఏ విధమైన న్యూ ఇయర్ ఈవెంట్లు, వేడుకలు, పార్టీలు నిర్వహించాలన్నా ముందస్తుగా పోలీస్ శాఖ నుండి అనుమతులు తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. ఈవెంట్ల నిర్వహణలో పాల్గొనే జనసంఖ్య, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలు ముందుగానే పోలీస్ శాఖకు తెలియజేయాలన్నారు. ఒక వేళ వేడుకలు, పార్టీలో మద్యం సరఫరాకు సంబంధిత బార్ అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. ఈవెంట్ల నిర్వహణకు సంబంధించి ఎక్సైజ్ శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల అనుమతులు పొందిన అనంతరం, వాటి వివరాలను పోలీస్ శాఖకు తెలియజేయాలని సూచించారు. ఇప్పటివరకు ఇద్దరు వ్యక్తులు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎలాంటి ఈవెంట్లు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. న్యూ ఇయర్ సందర్భంగా రాత్రి ఒంటి గంట తర్వాత ప్రజలు రోడ్లపై తిరగరాదని, అలాగే ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించకూడదని సూచించారు. మద్యం తాగి అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదని హెచ్చరించారు. అటువంటి వారు పోలీసులకు పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అధిక శబ్దం వచ్చే సౌండ్ సిస్టమ్‌లు, డీజేలు తదితర శబ్ద కాలుష్యం కలిగించే పరికరాల వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నామని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాల స్వాధీనం, డ్రైవింగ్ లైసెన్సుల రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యూ ఇయర్ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా పైడి భీమవరం నుంచి ఇచ్చాపురం వరకు ముఖ్యమైన పట్టణాలు, కూడళ్లు, రహదారులపై ప్రత్యేక పోలీస్ బందోబస్తు, గస్తీ, వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా సీసీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగిస్తూ, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరూ న్యూ ఇయర్ వేడుకలను తమ తమ ఇళ్లలోనే కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చట్ట నిబంధనలను పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు.

### నందిగాం మండలం..
# ఇక టెక్కలి డివిజన్‌లోనే!

* నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం * నేటి నుంచి అమలు
* పాలనా సౌలభ్యం కోసమే పునర్వ్యవస్థీకరణ:మంత్రి అచ్చెన్న

శ్రీకాకుళం, డిసెంబరు30(వార్త): జిల్లాలోని నందిగాం మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుండి టెక్కలి రెవిన్యూ డివిజన్‌లోకి మారుస్తూ ప్రభుత్వం మంగళవారం తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. పరిపాలనా సౌలభ్యం, అభివృద్ధి ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ప్రతిపాదించిన మార్పులపై ప్రజల నుండి అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం గవర్నర్ పేరిట ఈ గెజిట్ వెలువడింది. ఈ మార్పు ఈనెల 31 నుండి అమలులోకి రానుంది. దీనితో టెక్కలి డివిజన్‌లోని మండలాల సంఖ్య 10కి చేరగా, పలాస డివిజన్‌లో 7 మండలాలు ఉండనున్నాయి. ప్రజల ఆకాంక్షలు, పాలన సౌలభ్యం ప్రాతిపదికన జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను సవరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిందని పేర్కొన్నారు. నందిగాం మండలాన్ని తిరిగి టెక్కలి డివిజన్‌లోకి మారుస్తూ ప్రభుత్వం మంగళవారం తుది నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం కేవలం రాజకీయ కారణాలతో నందిగాంను పలాస డివిజన్‌లో కలిపిందని, ప్రజల విజ్ఞప్తుల మేరకు దానిని తిరిగి టెక్కలి డివిజన్‌లోకి తీసుకువచ్చామన్నారు. దీనివల్ల స్థానికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మార్కాపురం, పోలవరం కొత్త జిల్లాలతో పాటు, 5 కొత్త రెవెన్యూ డివిజన్లు, ఒక మండలాన్ని పునర్వ్యవస్థీకరిస్తూ ఇప్పటికే జీవోలు విడుదలయ్యాయని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కేబినెట్ సబ్ కమిటీ క్షేత్రస్థాయిలో సుదీర్ఘ అధ్యయనం చేసిన తర్వాతే ఈ మార్పులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ఎల్ఎన్‌పేట, డిసెంబరు30(వార్త): మండలంలోని శ్యామలాపురం ఆర్ అండ్ ఆర్ కాలనీ, దుగ్గుపురం గ్రామానికి చెందిన శృంగవరపు యుగంధర్ (24) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సరుబుజ్జిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్యామలాపురం ఆర్ఆర్ కాలనీ, దుగ్గుపురం గ్రామానికి చెందిన శృంగవరపు ఆనందరావు, శ్యామల దంపతుల కుమారుడు యుగంధర్ సోమవారం రాత్రి 8గంటల సమయంలో ఇంట్లో భోజనం చేసి హిరమండలంలో సెకెండ్ షో సినిమాకు వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లాడు. సినిమా చూసి ఇంటికి వస్తుండగా శ్యామలాపురం జంక్షన్ వద్ద మద్ది చెట్టుకు అతని వాహనం ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. సరుబుజ్జిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే డోల సీతారాములు సతీమణి విశాలాక్షి మృతి

నరసన్నపేట, డిసెంబరు30(వార్త): దివంగత మాజీ ఎమ్మెల్యే డోల సీతారాములు సతీమణి డోల విశాలాక్షి (78) మృతి చెందారు. మంగళవారం ఉదయం ఆమె పోలాకిలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో ఆమె సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆమె కుమారుడు డోల జగన్మోహన్ డీసీసీబీ అధ్యక్షుడిగా సేవలు అందించగా, రెండో కుమారుడు డోల ఉదయ్ కుమార్ ప్రస్తుతం సర్పంచ్‌గా ఉన్నారు. రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు, స్థానిక నాయకులు విశాలాక్షి మృతికి సంతాపం తెలిపారు.

# ఆరో సారి.. సాయిరాంకే పట్టం

* ఏపీ ఎన్జీవో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా హనుమంతు సాయిరాం * కార్యదర్శిగా చల్లా శ్రీనివాసరావు * ఎన్నికలకు తరలివచ్చిన ఉద్యోగులు * అధ్యక్ష స్థానంతో కలుపుకొని 17 మందితో నూతన కార్యవర్గం



శ్రీకాకుళం, డిసెంబరు30(వార్త): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గం ఎన్నిక మంగళవారం స్థానిక ఎన్జీజీఓ హోం ప్రాంగణంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా హనుమంతు సాయిరాం, కార్యదర్శిగా చల్లా శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గం ఏకగ్రీవమైంది. ఈ కొత్త కార్యవర్గం రెండేళ్ల పాటూ విధులు నిర్వర్తించనుంది. ఏపీ ఎన్జీజీఓ సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా ఆరోసారి హనుమంతు సాయిరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఆర్.రవిశంకర్ (జిల్లా కార్యదర్శి, ఏపీఎన్జీజీఓ అసోసియేషన్, విశాఖపట్నం జిల్లా శాఖ), సహాయ ఎన్నికల అధికారిగా వై.ఎన్.ప్రసాద్ (జాయింట్ సెక్రటరీ, ఏపీఎన్జీజీఓ అసోసియేషన్, విశాఖపట్నం జిల్లా శాఖ) వ్యవహరించారు. అధ్యక్షులుగా హనుమంతు సాయిరాం, సహాధ్యక్షులుగా కె.జయరావు, ఉపాధ్యక్షులుగా టి.సోమేశ్వరరావు, రాయి వేణుగోపాల్, పి.జానకిరామ్, డి.శ్రీరామ్ కుమార్, ఎల్.జగన్మోహన రావు, పి.శ్రావణి, కార్యదర్శిగా చల్లా శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆర్.గోవింద్ పట్నాయక్, సంయుక్త కార్యదర్శులుగా ఏజేఎం రాధాకృష్ణ, కె.మోహన్ రావు, బి.వెంకటేశ్వరరావు, కె.మన్మథరావు, కేవీవీ సత్యనారాయణ, జి.లలిత, కోశాధికారిగా బడగల పూర్ణ చంద్రరావు ఎన్నికయ్యారు. మొత్తం 17 మందితో కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. వారంతా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలివచ్చారు.

# 2 నుంచి కొత్త పాస్‌పుస్తకాల పంపిణీ

* జనవరి 2 నుంచి 9 వరకూ గ్రామసభలు
* 652 గ్రామాల్లో మొత్తం 2,54,218 పుస్తకాలు పంపిణీ

శ్రీకాకుళం, డిసెంబరు30(వార్త): జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పాత భూహక్కు పత్రాల స్థానంలో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి రంగం సిద్ధమైంది. జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేకంగా రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి వీటిని అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఎల్ఏ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా 652 గ్రామాల్లో మొత్తం 2,54,218 పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం జారీ చేస్తున్న ఈ కొత్త పాస్‌పుస్తకాల్లో ఎలాంటి రాజకీయ ముద్రలు, లోగోలు లేకుండా కేవలం ప్రభుత్వ చిహ్నంతోనే ముద్రించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. వెబ్‌ల్యాండ్ డేటాతో క్షుణ్ణంగా ధృవీకరించిన తర్వాతే అర్హులైన రైతులకు ఈ పత్రాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ సమయంలో ఏవైనా అభ్యంతరాలు వస్తే వాటిని నమోదు చేసి, సంబంధిత తహసీల్దార్ ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. రైతులు తమకు కేటాయించిన గ్రామసభల వేదికలకు వెళ్లి వీటిని తీసుకోవచ్చని, సభల షెడ్యూల్ వివరాలను ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని ఆయన పేర్కొన్నారు. భూములకు సంబంధించి పూర్తి పారదర్శకతతో కూడిన రికార్డులను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## కిలో రూ.20 కే గోధుమ పిండి

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని రేషన్ కార్డుదారులకు జనవరి 2వ తేదీ నుండి చౌక ధరల దుకాణాల ద్వారా ఒక్కో కార్డుకు ఒక కిలో చొప్పున గోధుమ పిండిని పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ పంపిణీలో భాగంగా కిలో గోధుమ పిండి ధరను 20 రూపాయలుగా నిర్ణయించామని, అర్హులైన వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## జాతీయ ఘట్కా పోటీలకు నరసన్నపేట విద్యార్థిని ఎంపిక

**నరసన్నపేట, డిసెంబరు 30(వార్త):** నరసన్నపేట పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని టెంక హారిక జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు ఎంపికై పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా నిలిచింది. వచ్చే జనవరి తొలి వారంలో పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి ఘట్కా పోటీల్లో హారిక పాల్గొననుంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు పైడి వెంకట్రావు, ఉపాధ్యాయ బృందం హారికను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ఒక స్థానిక వ్యాపారవేత్త అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు ఎం.వి. రమణ, కే. గణపతిరావు పాల్గొని హారికకు మరింత ప్రోత్సాహం అందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపాలని పాఠశాల వర్గాలు ఆకాంక్షించాయి.



## చెత్త నుంచి సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలి



**నరసన్నపేట, డిసెంబరు 30(వార్త):** గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద కేంద్రాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి సమర్థవంతంగా నిర్వహించాలని డివిజనల్ పంచాయతీ అధికారి గోపి బాల అధికారులను ఆదేశించారు. మంగళవారం నరసన్నపేట మేజర్ పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెత్త నుంచి సంపద కేంద్రాలు స్వయం పోషితంగా, అభివృద్ధి పథంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యర్థాల వర్గీకరణ, రీసైక్లింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరచడంతో పాటు అవసరమైన వనరులు సమకూర్చుకునే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కేంద్రాల ద్వారా గ్రామాలకు ఆర్థిక ప్రయోజనాలు కలగాలనే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు రమేష్, ద్రాక్షాయిని తదితర సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు స్థిరమైన అభివృద్ధికి చెత్త నుంచి సంపద కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని డీపీఓ పేర్కొన్నారు.

## గొట్టిపల్లి-యాతపేటలో ఎన్ఎస్ఎస్ శిబిరం




**నరసన్నపేట, డిసెంబరు 30(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గొట్టిపల్లి, యాతపేట గ్రామాల్లో ప్రత్యేక ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ శిబిరం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావనను పెంపొందించడమే లక్ష్యంగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ లత తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగనున్న ఈ శిబిరంలో గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించనున్నారని ఆమె పేర్కొన్నారు. శిబిరం ప్రారంభమైన తొలి రోజే వాలంటీర్లు రెండు గ్రామాల వీధుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పరిసరాల శుభ్రతపై గ్రామస్థుల్లో అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ రవి పాల్గొని ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించారు. యువత సామాజిక సేవలో ముందుండటం గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భోజన పథకం సక్రమంగా అమలు చేయాలి



**నరసన్నపేట, డిసెంబరు 30(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓ-1 ఉప్పాడ శాంతారావు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంగళవారం నరసన్నపేటలోని పెద్దపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, పరిమాణం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారీ, వడ్డింపు ప్రక్రియ పూర్తిగా ఆరోగ్యకరమైన విధానంలో జరగాలని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు కావాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, హాజరు పెంపు కోసం ఈ పథకం కీలకమని ఎంఈఓ తెలిపారు.

## సుందరరావు మృతి తీరని లోటు



**సోంపేట, డిసెంబరు 30(వార్త):** సొండి సామాజికవర్గం, సంఘ అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన కొర్లాం గ్రామానికి చెందిన రత్నాల సుందరరావు మృతి తీరని లోటు అని ఆ సామాజిక వర్గ ప్రతినిధులు పేర్కొన్నారు. సుందరరావు మంగళవారం మృతి చెందారు. వివిధ గ్రామాలకు చెందిన ఆ సామాజిక వర్గ ప్రతినిధులు సుందరరావు కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన కుమారుడు రత్నాల శ్రీనివాసరావు సొండికుల సంఘ రాష్ట్ర కోశాధికారిగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు.

## రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

**నరసన్నపేట, డిసెంబరు 30(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తహసీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మంగళవారం నరసన్నపేట మండలం లుకలాం సచివాలయ పరిధిలో నిర్వహించిన సమగ్ర భూ రీ సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రీ సర్వే ప్రక్రియ కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. ఈ రీ సర్వే ద్వారా భూ హద్దుల వివాదాలు, రికార్డుల లోపాలు సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమం విజయవంతం కావాలంటే రైతులు అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. సంబంధిత శాఖల సమన్వయంతో రీ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.



# టీడీపీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయండి

### -నాయకులు, కార్యకర్తలకు

### ఎమ్మెల్యే కూన.. దిశా నిర్దేశం





**ఆమదాలవలస, డిసెంబరు 30(వార్త):** ఆమదాలవలసలో తెలుగుదేశం పార్టీ బలోపేతాన్ని లక్ష్యంగా చేసుకుని భారీస్థాయిలో నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని శాసనసభ్యుడు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ నిర్వహించారు. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, గ్రామ స్థాయి టీడీపీ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం నిరంతరం పోరాడే పార్టీ అని, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకుని, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్ళాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రతి ఇంటికి చేరేలా ఇంటింటా ప్రచారం నిర్వహించాలని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని సూచించారు. క్లస్టర్ ఇంచార్జ్‌లు, గ్రామ ఇంచార్జ్‌లు ప్రజలతో నిరంతరం సంబంధం కొనసాగిస్తూ పార్టీకి బలమైన పునాది వేయాలని ఆదేశించారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, వారి కష్టాన్ని పార్టీ ఎప్పటికీ మర్చిపోదని రవికుమార్ భరోసా ఇచ్చారు. సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడి, నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు తమ సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు. రాబోయే రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని, సమిష్టిగా పనిచేస్తూ పార్టీని విజయపథంలో నడిపించాల్సిన అవసరం ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. మై టీడీపీ యాప్‌లో బాగా పనిచేసిన నాయకులు కార్యకర్తలకి ప్రశంసపత్రాలు అందజేశారు.

### ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి..

## ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

### -యూటీఎఫ్ నాయకుల డిమాండ్




**మందస, డిసెంబరు 30(వార్త):** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని యూటీఎఫ్ నాయకుల డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణ విభాగం ద్వారా ప్రచురించబడిన 2026 సంవత్సర యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలు మందస యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు, మండల ప్రధాన కార్య దర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలోనైనా ఉపా ధ్యాయ సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, ఉపా ధ్యాయులకు ఇవ్వవలసిన డీఏ, పీఆర్సీ బకాయిలు, ఐఆర్ తదితర ఆర్థిక సంబంధిత సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు జీఆర్ పురం, సొండిపూడి, లోహ రిబంద, బేతాళపురం, బహడపల్లి పాఠశాలలకు, ప్రాథమిక పాఠశాలలైన హరిపురం, కుంటికోట, మధ్య, మహదేవపురం, బిడిమి, గంగువాడ, రట్టి, బాలిగాం తదితర పాఠశాలలకు క్యాలండర్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయరాంమాలి, పూర్వ కార్యదర్శులు గున్న రమేష్, రాజాన పరమేశ్వరరావు, మందస మండల అధ్యక్షుడు జగదీష్ బడిత్య, సహాధ్యకురాలు ప్రియాంక మహారాణా, మహిళా కన్వీనర్ సీహెచ్ పద్మ, కోశాధికారి సోమనాథ్ శిష్టు, మండల పూర్వపు అధ్యక్షుడు పిన్నింటి కొండలరావు, దుర్గాప్రసాద్ పాణిగ్రహి, జిల్లా కౌన్సిలర్లు రెయ్యి కృష్ణారావు, తరణి సోమేశ్వరరావు, ప్రవీణ్ ప్రధానో, అంపోలు వల్లభరావు, మండల కార్యదర్శులు కుత్తుం సుధాకర్, పాలిన సాయికుమార్, తమ్మినాన రాంప్రసాద్, శాంతి కుమారిపాడి, కంసు ఖగేష్, పీతాంబరం మాలి, అరుణ్‌కుమార్ పాడి, సింహాచలపతి, సురేందర్ పండ, ఎం.నమితకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సాయికృష్ణ ఫర్టిలైజర్స్‌లో భారీ అవకతవకలు

### -150 టన్నుల ఎరువుల స్వాధీనం

**నరసన్నపేట, డిసెంబరు 30(వార్త):** నరసన్నపేటలో వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించి 150 టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని సాయి కృష్ణ ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణం, గోడౌన్‌లపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డీలర్ నిర్వహిస్తున్న ఐదు స్టోరేజ్ పాయింట్లలో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించిన అధికారులు, సరైన రికార్డులు లేవని, స్టాక్ వివరాల్లో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన 150 టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీ కృష్ణ తెలిపారు. స్వాధీనం చేసిన ఎరువుల విలువ సుమారు రూ.40.7 లక్షలు ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ ఘటనపై సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. రైతులను మోసం చేసేలా ఎరువుల నిల్వలు, పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారులు కె. వెంకటరావు, ఐ. శాంతి, ఏఈవో కె. బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు సమయానికి అందేలా జిల్లాలో తనిఖీలు మరింత కఠినంగా నిర్వహిస్తామని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు.



## ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**మందస, డిసెంబరు 30(వార్త):** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్ లను ఏపీటీఎఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో మందస మండలంలోని ఉన్నత పాఠశాలలు, పలు పాఠశాలల్లో పర్యటిస్తూ ఏపీటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే నూతన సంవత్సరంలో ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచించాలని కోరారు. అలా జరగని పక్షంలో ఉపాధ్యాయులు నూతన ఉత్సాహంతో ఉపాధ్యాయ ఉద్యమాల్లో విరివిగా పాల్గొనాలన్నారు. పట్టులోగాం, బుడంబో, కిల్లోయి, చిన్నకోష్ట ఆశ్రమ పాఠశాలల నూతన ఉపాధ్యాయులను కలిసి వారి జీతాల సమస్య గూర్చి రాష్ట్ర సంఘానికి ప్రాతినిధ్యం చేయనున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. మండలంలోని పలు పాఠశాలకు క్యాలెండర్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, సిరిపురం, మందస, జీఆర్ పురం, బీఎస్ పురం, కృష్ణాపురం ప్రధానోపాధ్యాయులు ఎన్.తారకేశ్వర రావు, ఎం.శ్రీనివాస రావు, కె.రమణమూర్తి, టీడీఎస్ ప్రసాదరావు, పి.మన్మథరావు, పట్టులోగాం, బుడంబో, చిన్నకోష్ట ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టి.శారద, బి.సీతారాం, కె.తిరుపతిరావు, ఏపీటీఎఫ్ మందస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బమ్మిడి బైరాగి, బత్తిని రామారావు, ఇతర కార్యవర్గ సభ్యులు డి.వైకుంఠరావు, ఎన్.కరుణాకర్, బి.మురళీమోహన్, ఎస్.కిరణ్‌కుమార్, సుశాంత్ కుమార్ రౌలో, ఎన్.ఢిల్లేశ్వరరావు, నిర్భదో లిమ్మా, ప్రభాకర్ పట్నాయక్, ఎస్.కోటేశ్వరి, పి.వేణుగోపాల్, రవిపాడి, సింహాచలపతి, ప్రసన్నకుమార్ నందో తదితరులు పాల్గొన్నారు.

## 2న మందసలో..
## ఐటీడీఏ పీవో గ్రీవెన్స్



**మందస, డిసెంబరు 30(వార్త):** మందస మండలంలో ఐటీడీఏ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ(సీతంపేట) ప్రాజెక్ట్ అధికారి పవర్ స్వప్నిల్ తెలిపారు. ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జనవరి 2వ తేదీన శుక్రవారం ఉదయం 10 గంటలకు మందస పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రీవెన్స్ ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి పలాస డివిజన్ స్థాయి అధికారులు, మందస మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు. మందస మండలం పరిధిలోగల అన్ని గ్రామాల గిరిజన ప్రజలు సమస్యలు, వినతులు గ్రీవెన్స్ లో అందజేయాలన్నారు.

## ఇరుకు రోడ్లతో నిత్యం ట్రాఫికర్



**సారవకోట, డిసెంబరు 30(వార్త):** బుడితి గ్రామంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్ర రూపం దాలుస్తోంది. గ్రామం చుట్టుపక్కల రైస్ మిల్లులు, హోల్‌సేల్ వ్యాపార కేంద్రాలు, కిరాణా దుకాణాలు, గ్రానైట్ క్వారీలు అధికంగా ఉండటంతో భారీ వాహనాల రాకపోకలు నిత్యకృత్యంగా మారాయి. ముఖ్యంగా లారీలు, ఊక లారీలు, బస్సులు తరచూ సంచరించడంతో రోడ్లపై రద్దీ పెరుగుతోంది. ఇప్పటికే ఇరుకుగా ఉన్న రోడ్లపై ఎదురెదురు వాహనాలు ఎదురయ్యే సమయంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చిన్నపాటి ఆలస్యం కూడా పెద్ద ట్రాఫిక్ జామ్‌గా మారుతుండటంతో వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. పాదచారుల భద్రతకూ ముప్పు ఏర్పడుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాల ఏర్పాటు అవసరమని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బుడితి గ్రామ వాసులు విన్నవిస్తున్నారు.

## సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న శాంతి



**ఎల్ఎన్ పేట, డిసెంబరు 30(వార్త):** వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విశాఖ పట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ పండి తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ "ముక్కోటి ఏకాదశి అత్యంత పవిత్రమైన రోజు అని రాష్ట్ర ప్రజలందరూ ఆయు రారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ నరసింహ స్వామిని ప్రార్థించామని పేర్కొన్నారు.

## మెగా డీఎస్సీ ఉపాధ్యాయుల ఔదార్యం




**ఇచ్ఛాపురం, డిసెంబరు 30(వార్త):** మెగా డీఎస్సీ 2025 ద్వారా ఎంపికై కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవలే ఉపాధ్యాయులుగా చేరిన ఉపాధ్యాయినిలు రొక్కం రాజ్యలక్ష్మి , ఫర్హానా షేక్, తెన్నేటి దుర్గా భవాని కలసి తాము పనిచేస్తున్న పాఠశాలకు సుమారుగా 20 వేల రూపాయల విలువగల ఇన్వెర్టర్ ను బహుమతి గా అందజేశారు. పాఠశాల అభివృద్ధిలో వాళ్లకు భాగస్వాములుగా చేసినందుకు గర్వంగా ఉందన్నారు. దీనిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రమీలకుమారి, ఉపాధ్యా యులు నరేంద్రనాథ్ పట్నాయక్‌కి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మోహన్ రావు, చంద్రవదన, భాస్కర్ రెడ్డి, అమిత బెహరా, శ్రీనివాస్ పూండి, మినుచంద్ర, నీలిప్, ఉప్పాడ పాపారావు, కోటేశ్వరరావు, దేవకి, కిరణ్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో తోషినీరోయ్ ప్రతిభ

**పలాస, డిసెంబరు 30(వార్త):** మహారాష్ట్ర నందడ్‌లో జరిగిన రోలర్ స్కేటింగ్ స్పోర్ట్స్ వీక్ నేషనల్ ఛాంపియన్ షిప్ 2025లో రోలర్ స్కేటింగ్ విభాగం నందు జక్కల తోషినీరోయ్ 300 మీటర్‌లో బంగారు పతకం కైవసం చేసుకుంది. తోషినీ రోయ్‌కి రోలర్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ బి.చంద్రావతి, సభ్యులు అభినందనలు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## చైతన్య దీపిక క్యాలెండరు ఆవిష్కరణ

**సోంపేట, డిసెంబరు 30(వార్త):** సోంపేట కేంద్రంగా సామాజిక సేవలు అందిస్తున్న శ్రీశయన చైతన్య దీపిక సంస్థ 2026 క్యాలెండర్ను మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ.. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గం ఇన్చార్జ్ దాసరి రాజు కలసి మంగళ వారం సోంపేటలో గల కోదండరామస్వామి ఆలయ ఆవరణలో ఆవిష్క రించారు. చైతన్య దీపిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఏవీ రామకృష్ణ సారథ్యంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవాడ మోహన్ రావు, దుద్ది వీర్రాజు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రతి ఏటా దేశంలోని శ్రీశైన సామాజిక వర్గ ప్రముఖులందరిను ఒక ప్లాట్ఫారం మీదకు తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా క్యాలెండర్ను ఎంతో అందంగా ముద్రించారన్నారు. సేవా కార్యక్రమాల్లో నిరంతరం మమేకం అవుతున్న చైతన్యదీపిక సభ్యులను అభినందించారు. జనసేన సోంపేట మండల అధ్య క్షుడు బీన ప్రదీప్, సంస్థ ప్రతినిధులు బల్ల జానకీరావు, తడక మాధవరావు, దోగాన లోకనాథం, ఆణింగి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



# సిటు మహాసభలను జయప్రదం చేయాలి

### - రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అజయ్ కుమార్ పిలుపు
### -వీరగున్నమ్మ స్థూపం వద్ద ఎర్రజండా రెపరెపలు



**మందస, డిసెంబరు 30(వార్త):** సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా జనవరి 4న విశాఖపట్నంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 31 నుంచి జనవరి 4వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభల వీరగున్నమ్మ ప్రచారజాతను మందసలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభానికి ముందు మందస జమీందారీ వ్యతిరేక పోరాటంలో అశువులు బాసిన విప్లవనారి వీరగున్నమ్మ స్థూపానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. జాతా ప్రారంభం సందర్భంగా రాధాకృష్ణపురం, భైరిసారంగపురం, మందసలో జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగే సీఐటీయు అఖిల భారత మహాసభల్లో జనవరి 4న మధ్యాహ్నం 2గంటలకు విశాఖపట్నం ఆర్.టి.సి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన అనంతరం మున్సిపల్ స్టేడియంలో బహిరంగసభ జరుగుతుందని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం కార్మికవర్గం ఎన్నడూ ఎదుర్కొని తీవ్రమైన కష్టాలు నేడు ఎదుర్కొంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్పొరేట్లకు కొమ్ము కాసి కార్మిక ఉద్యమాలను అణిచివేస్తున్నాయని కార్మికుల ఏ ఒక్క సమస్యను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుండా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ధరల పెరుగుదల ఆకాశాన్ని అంటుతున్నాయని, కానీ జీతాలు పాతాళంలో ఉన్నాయన్నారు. మరో వైపు అదానీ, అంబానీ కార్పొరేట్ల ఆస్తులు వంద రెట్లు అమాంతంగా పెరుగు తున్నాయని, అసమానతలు, పేదరికం ఎన్నడూ లేని స్థాయికి చేరాయన్నారు. విశాఖపట్నంలో జరిగే అఖిల భారత సీఐటీయూ మహాసభలు కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించబోతున్నదన్నారు. లేబర్ కోడ్స్ రద్దు అయ్యేవరకు పోరాడనుందని, కార్మికవర్గ అనుకూల విధానాలను అమలు చేయించడానికి పాలకవర్గంపై ఒత్తిడి పెంచనుందన్నారు. ఈ ప్రత్యాన్నాయ విధానాల కోసం సమరశీల శంఖరావం పూరించనుందని, 5రోజులు జరిగే అఖిల భారత మహాసభల చర్చించిన విషయాలను జనవరి 4న బహిరంగ సభ ద్వారా దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి పిలుపు ఇవ్వనుందన్నారు. మహాసభలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం వేదికగా మారడం రాష్ట్ర కార్మికవర్గానికి గర్వకారణమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు జీతాలు పెంచం, జీవితాంతం పనులు చేసినా పర్మినెంట్ చేయం, విశాఖ స్టీల్ ప్లాంట్ తో సహా అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మివేస్తాం లేదా మూసివేస్తాం అనే పద్ధతిలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. లేబర్ కోడ్స్ పేరుతో బ్రిటిష్ కాలం నాటి నుంచి సాధించుకున్న హక్కులను తొలగిస్తాం, సంఘాలు పెట్టనివ్వం, సమ్మెలు చేయనివ్వం అనే తప్పుడు విధానాలు అమలు చేస్తున్నాయని, సర్వ సంపదలు సృష్టించేది కార్మికవర్గం ఒక్కటే. మరోవైపున ప్రజలకు తిండిపెట్టే వ్యవసాయ కార్మికుల ఉపాధి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ధ్వంసం చేసిందన్నారు. వ్యవసాయ కార్మికుల పొట్టలు కొట్టిందని, కార్మిక, కర్షక ఐక్యతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను త్రిప్పి కొట్టడమే అఖిల భారత మహాసభల ప్రధాన లక్ష్యమన్నారు. కార్పొరేట్లకు మేలు చేసే, కార్మిక వర్గం హక్కులను హరించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సీఐటీయు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు సీఐటీయూ అఖిలభారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచుతూ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు మట్ట ఖగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మందస మండల కన్వీనర్ కె.కేశవరావు, కోకన్వీనర్లు బి.దేవేంద్ర, ఎస్.వల్లభరావు, జీడి, రైస్ మిల్, మధ్యాహ్న భోజనం, గిరిజన సంఘం తదితర సంఘాల నాయకులు ఆర్.దిలీప్కుమార్, టి.లక్ష్మీనారాయణ, ఎం.ధర్మారావు, అల్లాడ కృష్ణ, బాలమ్మ, సునీత, పి.వరలక్ష్మి, ఏకాశి తదితరులు పాల్గొన్నారు.

## అశోక్‌బాబుకు కృతజ్ఞతలు



**సోంపేట, డిసెంబరు 30(వార్త):** సోంపేట బాలుర ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఇటీవల ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సోంపేటలో నిర్వహించి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ బాబు హాజరైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరూ కలిసి మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అశోక్ బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## విరివిగా మొక్కలు నాటాలి



**పలాస, డిసెంబరు 30(వార్త):** పర్యావరణ పరిరక్షణ కోసం విరివిరిగా మొక్కలు నాటాలని జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల వారి ఆదేశాలపై మంగళవారం పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మొక్కలు నాటే కార్యక్రమాన్ని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు, వృక్షము నుంచి వచ్చే ఆక్సిజన్ అత్యంత ఆవశ్యమని, ప్రకృతిని కాపాడుకోవడంలో మొక్కలు చేసే సహాయము అమూల్యమైనదని తెలియజేశారు. మొక్కలు ఆక్సిజన్ను విడుదల చేసి కాలుష్యాన్ని తగ్గిస్తాయి, వాతావరణ సమతుల్యతను కాపాడతాయన్నారు. ప్లాస్టిక్ వాడకంలో వినియోగదారులు పొల్యూషన్ గురించి ఆలోచించాలని, తద్వారా కాలుష్య నివారణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బికేఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జీఎంఎస్ అనిల్ రాజు, న్యాయవాదులు ఎస్ నాగేశ్వంరావు, లోకేశ్వరరావు, కె.దేవరాజు, చిట్టిబాబు, సూపరింటెండెంట్ కె.కృష్ణారావు, గుమాస్తాలు నారాయణ లక్ష్మణరావు, పారా వాలంటీర్ తిరుమల, సునీల్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లైఫ్ సర్టిఫికేట్ అందించండి

**శ్రీకాకుళం, డిసెంబర్ 30 (వార్త):** జనవరి 1 నుండి ఫింఛను దారుల జీవన ప్రమాణ ధృవీకరణ పత్రాలు అందజేయాలని ఖజానా శాఖ ఉప సంచాలకులు సిహెచ్ రవి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవీ విరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (సర్వీసు పింఛను దారులు), కుటుంబ పింఛను దారులు వార్షిక జీవన ప్రమాణ ధృవీకరణ పత్రాలు జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 లోగా సమర్పించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, కుటుంభ పింఛను దారులు తమ వార్షిక జీవన ప్రమాణ దృవీకరణ పత్రాలను జీవన ప్రమాణ్ పోర్టల్లో గానీ, పింఛనర్ల వ్యక్తిగత సి.ఎఫ్.ఎం.ఎస్ లాగిన్లో గాని లేదా ఖజానా కార్యాలయంలో సమర్పించవచ్చని సూచించారు. ఆధార్, మొబైల్, పి పి ఓ బ్యాంకు ఖాతా సరిచూసుకోవాలని తెలియజేశారు. ఫిబ్రవరి 28లోగా సమర్పించకపోతే ఏప్రిల్ ఒకటో తేదీ వచ్చే మార్చి నెల పింఛను నిలిపివేయబడతాదని తెలిపారు. జిల్లా ఖజానా, లెక్కల కార్యాలయం, శ్రీకాకుళం, ఫింఛను విభాగం వద్ద, జిల్లాలో గల అన్ని ఉప ఖజానా కార్యాలయాలలో వార్షిక జీవన ప్రమాణ దృవీకరణ పత్రాల కొరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## ముగ్గురికి వారం రోజులు జైలుశిక్ష

**శ్రీకాకుళం, డిసెంబర్ 30 (వార్త):** బహిరంగ ప్రదేశంలో ఈనెల 29న మద్యం తాగి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన మహాలక్ష్మి నగర్ కాలనీకి చెందిన దువ్వు సాయి పవన్, గంగారాపు రాజశేఖర్, అంబటి తరుణ్లపై శ్రీకాకుళం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేశారు. వారిని మంగళవారం పోలీసులు శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. మేజిస్ట్రేట్ కె.శివరాంకృష్ణ ఈ ముగ్గురు వ్యక్తులకు వారం రోజులు పాటు జైలు శిక్ష విధించారని ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఈనెల 31న అర్ధరాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి అల్లరి చేసినా, ప్రజాశాంతికి భంగం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.


## రీ-సర్వేతో భూ సమస్యల పరిష్కారం



**జి.సిగడాం, డిసెంబరు 30(వార్త):** రీ-సర్వేతో రైతుల భూసమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ మహాదేవు సరిత తెలిపారు. మంగళవారం పెంట గ్రామం ఏపీ రీ-సర్వే ప్రాజెక్ట్లో భాగంగా రీ-సర్వే గ్రామసభ-అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు క్రయ విక్రయాలు జరిపిన వెంటనే రెవెన్యూ భూరికార్డుల్లో తమ భూ హక్కులను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో ఆర్ఐ, సర్వేయర్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని సర్వే సమయంలో అధికారులకు సహకరించాలని కోరారు. ఆధునిక సాంకేతిక డీజీపీఎస్(డిఫరెన్సియల్ గ్లోబల్ పొజిషన్ సర్వే) పరికరాలతో భూములు సర్వే చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సర్వే చేసేటప్పుడు భూములు కలిగిన రైతులందరూ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇప్పటివరకు రికార్డుల్లో నమోదైన భూములతో పాటు నమోదు కాని అన్ని రకాల భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. దీనివల్ల దీర్ఘకాలికంగా ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సెంటు భూమి కూడా తేడా లేకుండా సర్వే చేసి ప్రతి సరిహద్దు వద్ద రాళ్లు తామే పాతుతామని చెప్పారు. ఈ సందర్భంగా రైతుల అనుమానాలను రెవెన్యూ అధికారులు నివృత్తి చేశారు. రీ సర్వేలో ఉత్పన్నమయ్యే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తహసీల్దార్ ఆధ్వర్యంలో మొబైల్ కమిటీ ఉందని తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ కొత్తపల్లి గాయత్రి, ఆర్ఐ రాధ, సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ మక్క శ్రీలత, గ్రామ నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి దుర్గారావు, వీఆర్వో భూపతి నర్సింగరావు, గ్రామ సర్వేయరు కిషోర్ బాబు, నాయకులు మక్క నారాయణరావు, మక్క శ్రీనివాసరావు, పున్నాన అక్కలనాయుడు, గ్రామస్తులు డోల పార్వతి, పున్నాన పాపినాయుడు పాల్గొన్నారు.

## ఆర్‌వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### -పలాస కాశీబుగ్గ ఆర్ఓబీ నిర్మాణ పనుల పురోగతిపై ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ, సమీక్ష



**పలాస, డిసెంబరు 30(వార్త):** ఆర్వోబీ నిర్మాణ పనుల వేగవంతం చేయాలని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వేగంగా రూపుదిద్దుకుంటున్న రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులను మంగళవారం పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద సమావేశమై ఈ నిర్మాణం ప్రజలకు మరింత అనుకూలంగా, శ్రేయస్కరంగా ఉండేలా చేపట్టాల్సిన మార్పులపై క్షుణ్ణంగా చర్చించారు. ముఖ్యంగా భవిష్యత్తులో వర్షాకాలంలో ఎదురయ్యే నీటి నిల్వ సమస్యను దృష్టిలో ఉంచుకుని, రోడ్డుపైకి నీరు రాకుండా నిరోధించేలా సమర్థవంతమైన మురుగు కాలువల వ్యవస్థ నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అనంతరం బృందం మొత్తం మూడు రోడ్ల జంక్షన్ నుండి ఫ్లైఓవర్ ప్రారంభ స్థానం వరకు కాలినడకన ప్రయాణించి పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, "ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడమే కూటమి ప్రభుత్వం ప్రథమ కర్తవ్యమని, ఈ ఆర్వోబీ పనులను త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి పలాస పుర ప్రజలకు అంకితం చేస్తామన్నారు. సదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా ప్రయాణించేలా మార్గం సుగమం చేస్తామని, ఈ నిర్మాణ పనులన్నీ మా నిరంతర పర్యవేక్షణలో జరుగుతున్నాయి," అని హామీ ఇచ్చారు. ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న ఈ బృహత్కార్యానికి అందరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విటల్ రావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, జిల్లా పార్లమెంటు వైస్ ప్రెసిడెంట్ గాలి కృష్ణారావు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ టీడీపీ కార్యదర్శి సప్ప నవీన్, అన్ని వార్డు ఇంచార్జి, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు పోలీసుల అనుమతి తప్పనిసరి



**పలాస, డిసెంబరు 30(వార్త):** నూతన సంవత్సర వేడుకలు కోసం కాశీబుగ్గ పోలీసల అనుమతి తప్పనిసరని కాశీబుగ్గ సీఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం సాయంకాలం మీడియాతో మాట్లాడుతూ నిబంధన మేరకు ప్రతి ఒక్కరు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి కల్చరల్ ప్రోగ్రామ్స్ కండక్ట్ చేయబోతున్నా దాని కోసం తప్పకుండా పోలీస్ వారి అనుమతి తీసుకోవాలని, సౌండ్ సిస్టమ్స్ కి కూడా పోలీస్ వారి అనుమతి తీసుకోవాలని సూచించారు. నూతన సంవత్సర వేడుకల కోసం రాత్రి 01.00 వరకు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. వాహనాలు మద్యం తాగి రోడ్లపై తిరిగేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయని, ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినా సరే ఆ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసిన ఆర్గనైజర్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ కూడా నూతన సంవత్సర వేడుకలు ఆనందంగా చేసుకోవాలన్నారు.

## ఇచ్ఛాపురానికి ఖ్యాతి తెచ్చిన లాషిక రెడ్డి



**ఇచ్ఛాపురం, డిసెంబరు 30 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ముత్యాలమ్మపేటకి చెందిన మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పిలక పద్మావతి యాదవ రెడ్డి మనవరాలు ఏడేళ్ల చిన్నారి పిలక లాషిక రెడ్డి, హైదరాబాద్లో గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియంలో భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి కళావైభవం నృత్యంలో గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించింది, ఇచ్ఛాపురం పట్టణానికి గర్వకారణంగా తలమానికమై నిలిచింది. ఈ కార్యక్రమంలో 7232 మంది పాల్గొన్నారు. లాషిక రెడ్డి హైదరాబాద్ విజ్ఞాన యశోదయ స్కూల్ లో 3వ తరగతి చదువుతోంది.



## నరసన్నపేట జూనియర్ కళాశాలలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

### - డాక్టర్ బలగ మురళి సేవాభావానికి ప్రశంసలు



**నరసన్నపేట, డిసెంబరు 30(వార్త):** నరసన్నపేట జూనియర్ కళాశాలలో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బలగ మురళి స్పందించి సేవాభావాన్ని చాటుకున్నారు. తాను చదువుకున్న కళాశాలపై కృతజ్ఞతాభావంతో రూ.50,000ల (యాభై వేల) విరాళాన్ని అందించి కళాశాలలో వాటర్ప్లాంట్ ఏర్పాటు చేయించారు. డాక్టర్ బలగ మురళి సహకారంతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది సమన్వయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్లాంట్ను డాక్టర్ బలగ మురళి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో కళాశాల వర్గాలు డాక్టర్ బలగ మురళి గారికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ విద్యార్థిగా కళాశాల అభివృద్ధికి తోడ్పడటం అభినందనీయమని పలువురు ప్రశంసించారు.



## చీడిపూడి కళ్యాణ వెంకటేశ్వర ఆలయంలో భక్తుల సందడి



**సారవకోట, డిసెంబరు 30(వార్త):** చీడిపూడి గ్రామంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాలు, మండలాల నుంచి భక్తులు పోటెత్తడంతో ఆలయ పరిసరాలు భక్తిశ్రద్ధలతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి రామానుజాచార్యులు భక్తుల సంక్షేమం కోసం స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆరాధనలు నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు, యువత సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేశారు. శాంతియుత వాతావరణంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## పలాసలో సీఐటీయూ ప్రచార జాతా

**పలాస, డిసెంబరు 30(వార్త):** సీఐటీయూ ఆలిండియా 18 మహాసభలు విశాఖపట్నంలో జరగనున్న నేపథ్యంలో సీఐటీయూ శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచార జాతా నిర్వహించారు. మందస వీరగున్నమ్మ స్తూపం వద్ద పూల మాలలు వేసి ప్రారంభించారు. అనంతరం మందసలో ప్రచారం సాగిస్తూ పలాస చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు, శ్రామిక మహిళా సంఘం నాయకులు కె,నాగమణి,అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్.గణపతి, వజ్రపుకొత్తూరు సీఐటీయూ నాయకులు యన్.మోహన్, ఆశ యూనియన్ నాయకులు పి.రమణమ్మ, పి.లక్ష్మీకాంతం, హేమావతి, రేవతి, మధ్యాహ్నం భోజనం పథకం నాయకులు పి.భూదేవి, స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు బి.స్వాతి, హమాలీ సంఘం నాయకులు గోవింద్, జయరాం, దేవరాజు, మున్సిపల్ యూనియన్ నాయకులు సీహెచ్ మురగన్, కె.ఈశ్వరరావు, బాలకృష్ణ, రైతు సంఘం నాయకులు టి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**ఎచ్చెర్ల, డిసెంబర్ 30 (వార్త):** యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, గతంలో నిరుద్యోగులు కంపెనీల చుట్టూ తిరిగితే ఇప్పుడు కంపెనీలే మీ వద్దకు వచ్చి ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి నెలకొందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడికుదిటి ఈశ్వరరావు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎచ్చెర్లలోని శ్రీ సాయి శిరీష డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 14 ప్రముఖ ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 621 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 311 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసి, వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ బి. శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ..వచ్చిన అవకాశం చిన్నదని, జీతం తక్కువని లేదా దూర ప్రాంతమని వెనకడుగు వేయక తొలి అడుగు వేస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని యువతకు దిశానిర్దేశం చేశారు. ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కె.సుధ సూచించారు. యువతలో నైపుణ్యాల ప్రాముఖ్యత గురించి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వి.రమణమూర్తి వివరించగా, ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధిని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ కోరారు. ఏ రంగంలో అవకాశం వచ్చినా దూరాన్ని లెక్క చేయకుండా చేరాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి, ఎన్.వై.కే డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల్, సెట్ శ్రీ సీఈఓ అప్పలనాయుడు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, న్యూక్లియర్ పర్మనెంట్ చీఫ్ ఇంజనీర్ రవికుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వర్ రావు, వివిధ ప్రజా ప్రతినిధులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ విక్రయాలపై కౌన్సిల్‌లో గరం..గరం..!





**పలాస, డిసెంబరు 30(వార్త):** పాలకవర్గం పదవీకాలం ముగుస్తున్న తరుణంలో అభివృద్ధి పనులు జరగడంలేదని కౌన్సిలర్లు నిలదీశారు. ప్లాస్టిక్ విక్రయాలపై గరం గరంగా మునిసిపల్ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ముక్తకంఠంగా ప్లాస్టిక్ విక్రయాలపై తక్షణమే నిర్మూలించాలని పట్టు పట్టారు. అధికారులు తీరుపై ఘాటుగా విమర్శిస్తూ ప్లాస్టిక్ సీజ్ చేసిన వాటిని ఎందుకు చూపించలేదని విమర్శించారు.

అధికారులు పట్టుబడిన ప్లాస్టిక్కు ఏం చేశారో సభ దృష్టికి తీసుకు రాలేదని, వాటి అంతర్యం ఏమిటని కౌన్సిలర్లు సనపల సింహాచలం, పప్పల ప్రసాద్ ప్రశ్నించారు. చైర్మన్ బల్ల గిరిబాబు కలగజేసుకొని జీరో అవర్‌లో వీటిపై మాట్లాడదామని దాటవేశారు. దీంతో అక్కడున్న సభ్యులు గుసగుసలు ఆడుకున్నారు.

అనంతరం టిడిపి కౌన్సిలర్ గురుటి సూర్యనారాయణ మాట్లాడుతూ ఎజెండాలోని 17వ అంశం, 19వ అంశం ఒకే విధంగా ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు స్పందిస్తూ కంప్యూటర్‌లో పొరపాటు జరిగిందని, దీనికి వివరణ ఇచ్చారు. కౌన్సిలర్ శ్రీకాంత్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పనితీరుపై సూటిగా ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు నీళ్లు నములుతు పొంతనలేని సమాధానమిచ్చారు. కౌన్సిలర్ పప్పల ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని కనీసం అధికారులు స్పందించట్లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్ని ఉన్నాయో గుర్తుంచకుండా ఎలా అంచనా వేశారని ప్రశ్నించారు. గుత్తేదారుడికి నిబంధన మేరకు అప్పగించవలసిన కుక్కల బెదదును అధికారుల తప్పిదాల వలన మరలా శునకాలు సంతాన ఉత్పత్తి జరిగితే దానికి ఎవరు బాధ్యతని సభలో నిలదీశారు. దీనిపై కమిషనర్ ఐ.శ్రీనివాసులు కలగజేసుకొని ప్రభుత్వం సుప్రీం గైడ్‌లైన్స్ ప్రకారం ముందుకు వెళ్తామని సభ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, మునిసిపల్ డీఈ కనకరాజు, ఏఈలు కిరణ్, విద్యుత్ ఏఈలు వివేకానంద, నాగభూషణ్, రెవెన్యూ అధికారులు గిరి, మున్సిపల్ అధికారులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.




## జిల్లాలో నేరాలు తగ్గుముఖం


✻ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 34 శాతం తగ్గిన నేరాలు ✻ వచ్చే ఏడాది పూర్తిస్థాయిలో నియంత్రిస్తాం

✻ జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, డిసెంబర్ 30 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టా యని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 34 శాతం తగ్గాయని, వచ్చే ఏడాది పూర్తిస్థాయిలో నియంత్రిస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియతో ఎస్పీ మాట్లాడారు. జిల్లాలో మొత్తం నేరాల పరిస్థితి 2024 సంవత్సరంలో 9,555 కేసులు నమోదు కాగా, 2025లో 6,314 కేసులు నమోదు అయ్యాయన్నారు. మొత్తం నేరాల్లో 34 శాతం తగ్గాయని చెప్పారు. శారీరక నేరాలు 2024లో 812 కేసులు నమోదు కాగా, 2025లో 666 కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు. ఈ విభాగంలో 18 శాతం తగ్గుదల సాధ్యమైందన్నారు. నేర నియంత్రణలో భాగంగా 2,389 మందిపై బైండోవర్ చర్యలు, 20మందిపై బాండ్ ఫోర్ఫిచర్, రౌడీ షీటర్లు మరియు సమస్యాత్మక కుటుంబాలపై కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. హత్య కేసులు 2024లో 17 హత్య కేసులు నమోదు కాగా, 2025లో 26 కేసులు నమోదు అయ్యాయన్నారు. అక్రమ సంబంధాలు, కుటుంబ కలహాలు, పాత కక్షలు ప్రధాన కారణాలుగా ఉన్నాయని తెలిపారు. రెండు హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్షలు విధించబడ్డాయని వెల్లడించారు. మహిళలపై నేరాలు 2024లో 477 కేసులు నమోదు కాగా, 2025లో 482 కేసులు నమోదై 1శాతం స్వల్ప పెరుగుదల కనిపించిందన్నారు. వరకట్న మరణాలు, అత్యాచారం, అపహరణ కేసుల్లో తగ్గుదల కనిపించినప్పటికీ, భార్యాభర్తల మధ్య తగాదాలు స్వల్పంగా పెరిగినట్లు తెలిపారు. మహిళలపై జరిగిన 24 కేసుల్లో రూ.4.87 లక్షల నష్టపరిహారం అందించబడిందన్నారు. మహిళా భద్రత కోసం నారీ శక్తి కార్యక్రమం, పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు, శక్తి యాప్, మహిళా హెల్ప్ డెస్కులు, శక్తి టీమ్స్ ద్వారా రక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పిల్లలపై నేరాలు 2024లో 39 కేసులు నమోదు కాగా, 2025లో 54 కేసులు నమోదు అయి 38శాతం పెరుగుదల కనిపించిందన్నారు. ఇందులో ఎక్కువగా ప్రేమ వ్యవహారాలు కారణంగా పిల్లలు ఇంటి నుంచి, గ్రామస్తులు, పరిచయం ఉన్న వ్యక్తులతో వెళ్లిపోవడం వల్ల కేసులు పెరిగాయని తెలిపారు. 25 కేసుల్లో రూ.7.80 లక్షల పరిహారం అందించామన్నారు. నియంత్రణ చర్యలుగా పాఠశాలల్లో గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ అవగాహన, శక్తి టీమ్స్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ / ఎస్టీ అట్రాసిటీ కేసులు 2024లో 66 కేసులు నమోదు కాగా, 2025లో 44 కేసులు మాత్రమే నమోదు అయి 33శాతం తగ్గుదల సాధ్యమైందన్నారు. 40 కేసుల్లో రూ.40.75 లక్షల పరిహారం అందించగా, 3 కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు విధించబడ్డాయని తెలిపారు. ఆస్తి సంబంధ నేరాలు 2024లో 411 కేసులు నమోదు కాగా, 2025లో 396 కేసులు నమోదయ్యాయి. చోరీకి గురైన ఆస్తుల్లో 91శాతం బాధితులకు తిరిగి అందజేయడం, రూ.4.08 కోట్లలో రూ.3.71 కోట్లు రికవరీ చేయడం జరిగిందన్నారు. 2025లో 71శాతం కేసుల్లో ప్రాపర్టీ రికవరీ సాధ్యమైందన్నారు. రోడ్డు ప్రమాదాలు 2024లో 279 ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా, 2025లో 243 ప్రమాదాలు మాత్రమే నమోదు అయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే 21శాతం తగ్గుదల నమోదైందన్నారు. రాబోయే ఏడాది రోడ్డు ప్రమాదాల నివారణకు మరింత ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ / ఓపెన్ డ్రింకింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 6,338 కేసులు నమోదు కాగా, 38 మందికి జైలు శిక్షలు, 286 మందికి రూ.10,000 చొప్పున జరిమానాలు విధించబడ్డాయి. ఓపెన్ డ్రింకింగ్ కేసుల్లో 13,000 మందిపై కేసులు నమోదు కాగా, 18 మందికి సాధారణ కారాగార శిక్షలు విధించబడ్డాయని తెలిపారు. గంజాయి ఎన్‌డీపీఎస్ కేసులు 2025లో 137 కేసులు నమోదు చేసి, 1,774 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 7 మందికి 4 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షలు విధించబడ్డాయని, జిల్లాలో 16 మంది రిపీట్ ఆఫెండర్లుగా గుర్తించిన వారిలో 9 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. 'అభ్యుదయం సైకిల్ యాత్ర', 'సంకల్పం' వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 2025లో జిల్లావ్యాప్తంగా 3,758 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, వాటి ద్వారా 94 కేసుల ఛేదన సాధ్యమైందని తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఈ ఏడాది 1,060 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామని చెప్పారు. మిస్సింగ్ కేసులు 2024లో 408 కేసులు నమోదు కాగా, 2025లో 353 కేసులు మాత్రమే నమోదు అయ్యాయి. ఇందులో 303 కేసులు ట్రేస్ చేయగా, మొత్తం మిస్సింగ్ కేసుల్లో 13 శాతం తగ్గుదల నమోదైందన్నారు. మొత్తం నేరాల్లో 13శాతం తగ్గుదల, సైబర్ నేరాల్లో 24శాతం తగ్గుదల నమోదైందన్నారు. 1930 హెల్ప్‌లైన్ ద్వారా తక్షణ స్పందన అందిస్తున్నామని తెలిపారు. 2025లో 144 రౌడీ షీట్లు, 204 సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేయగా, జిల్లాలోని 1,870 హిస్టరీ షీటర్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. ప్రతి ఆదివారం నేర చరిత్ర కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన 2,758 ఫిర్యాదుల్లో 2,686 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. 2025 సంవత్సరంలో మొత్తం 112 నెంబర్ ద్వారా 9622 కాల్స్ రాగా వాటిలో 237 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. లోక్ అదాలత్ ద్వారా 2,990 కేసులు ఈ ఏడాదిలో పరిష్కరించబడ్డాయన్నారు. మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. నార్కోటిక్ సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా మన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం నిబద్ధతతో పనిచేస్తుందని ఎస్పీ మీడియాకు వివరించారు.

## పార్టీని మరింత బలోపేతం చేద్దాం

**ఆమదాలవలస, డిసెంబర్ 30 (వార్త):** తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేద్దామని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై ఆమదాలవలసలో మంగళవారం నియోజకవర్గ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం నిరంతరం పోరాడే పార్టీ అని, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసు కుని, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రతి ఇంటికి చేరేలా ఇంటింటా ప్రచారం నిర్వహించాలని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని సూచించారు. క్లస్టర్ ఇంచార్జీలు, గ్రామ ఇంచార్జ్‌లు ప్రజలతో నిరంతరం సంబంధం కొనసాగిస్తూ పార్టీకి బలమైన పునాది వేయాలని ఆదేశించారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, వారి కష్టాన్ని పార్టీ ఎప్పటికీ మర్చిపోదన్నారు. అనంతరం మై టీడీపీ యాప్‌లో బాగా పనిచేసిన నాయ కులు, కార్యకర్తలకి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ కన్వీనర్లు, కోకన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, గ్రామ స్థాయి టీడీపీ ఇంచార్జ్‌లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





## తపోవనం చెరువు గట్టుపై అక్రమ నివాసాలపై
## గ్రామస్తుల ఆందోళన
### -చోరీల నేపథ్యంలో అధికారులకు ఫిర్యాదు



**నరసన్నపేట, డిసెంబరు 30(వార్త):** గొట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తపోవనం చెరువు గట్టుపై అక్రమంగా నివాసాలు ఏర్పరచుకుని ఉంటున్న సంచార జాతులు (బాగోతులు)గా పిలవబడే వర్గానికి చెందిన వ్యక్తులపై గ్రామంలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ వర్గానికి చెందిన వారు స్థానిక ఆలయాల్లో చోరీలకు పాల్పడుతూ, రాత్రి వేళల్లో పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పోలాకి మండలంలోని ఒక ఆలయంలో జరిగిన చోరీ కేసులో సీసీ కెమెరాల ఆధారంగా పోలీసు అధికారులు నిందితులను గుర్తించినట్లు సమాచారం. ఈ విషయం వెలుగులోకి రావడంతో గొట్టిపల్లి గ్రామ ప్రజలు, పెద్దలు ఆందోళన వ్యక్తం చేశారు. తమ పంచాయతీకి చెడ్డ పేరు రాకుండా ఉండేందుకు తపోవనం చెరువు గట్టుపై ఉన్న అక్రమ నివాసాలను ఖాళీ చేయించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో స్థానిక వీఆర్వో, పంచాయతీ సెక్రటరీలను పిలిపించి గ్రామస్తులు చర్చలు నిర్వహించారు. అక్రమ నివాసాలు, చోరీల ఆరోపణలపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ అంశంపై సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు పంచాయతీ స్థాయిలో చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గ్రామ శాంతి భద్రతలు, ఆలయాల పరిరక్షణ, ప్రజల ఆస్తుల భద్రత దృష్ట్యా అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గొట్టిపల్లి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఈవీఎంలు భద్రం

✻ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

✻ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎంల పరిశీలన

**శ్రీకాకుళం, డిసెంబర్ 30(వార్త):** జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) అత్యంత భద్రంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాములను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే తనిఖీల్లో భాగంగా గోదాము సీళ్లను తెరిచి యంత్రాలను పరిశీలించారు. అనంతరం తనిఖీ పుస్తకంలో కలెక్టర్‌తో పాటు ప్రతినిధులు సంతకాలు చేశారు. గోదాముల వద్ద భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును, విద్యుత్ సౌకర్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని, పోలీసు భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని ఆదేశించారు. తనిఖీలకు ముందు కలెక్టరేట్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఓటర్ల తాజా గణాంకాలను వెల్లడించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 18,92,149మంది ఓటర్లు ఉన్నారని అందులో పురుషులు 9,37,191 మంది కాగా, మహిళా ఓటర్లు 9,54,848 మంది ఉన్నా రని వివరించారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో అత్యధికంగా 2,75,568 మంది ఓటర్లు ఉండగా, ఆమదాలవలసలో అత్యల్పంగా 1,94,209 మంది ఓటర్లు ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,358 పోలింగ్ కేంద్రాలు అందు బాటులో ఉన్నాయన్నారు. గత జనవరి 6 నుంచి ఈ డిసెంబర్ 30 వరకు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు కోసం 37,586 దరఖాస్తులు అందా యని, వాటిలో 29,795 దరఖాస్తులను ఆమోదించామని కలెక్టర్ వివరించారు. ఓటరు జాబితా నాణ్యత, పారదర్శకత విషయంలో రాజకీయ పార్టీల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ లక్ష్మణమూర్తి, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వరరావు, వివిధ పార్టీల ప్రతినిధులు పి.ఎం.జె బాబు, భూపతి అర్జున్ కుమార్, సురేష్ సింగ్, రౌతు శంకరరావు, ఎల్.సోమేశ్వరరావు, ఎం.గోవిందరావు, కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, పి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి..సంక్షేమ నామ సంవత్సరంగా 2025..!

### -కూటమి సుపరిపాలన సూపర్ సక్సెస్...!
### ఆరు గ్యారంటీలతో అదరహో...!
### ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు



**పలాస, డిసెంబరు 30(వార్త):** కూటమిపాలన ఆరు గ్యారెంటీలతో సూపర్ హిట్ అయిందని, అభివృద్ధి సంక్షేమలో పరుగులు పెడుతూ 2025వ సంవత్సరం అభివృద్ధి సంక్షేమ నామ సంవత్సరంగా నిలిచిందని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాది కాలంలో ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలతో ముందుకు వెళ్లామని 67.27 లక్షల మంది విద్యార్థులకు పదివేల తొమ్మిది వందల కోట్లు తల్లికి వందనం చెల్లించి పేద బడుగు కుటుంబాల కళ్ళల్లో ఆనందం చూసామని, 46 లక్షల మంది రైతులకు 6310 కోట్ల అన్నదాత సుఖీభవ పథకం కింద జమ చేసి రైతును రాజుగా చేయడానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. 2684 కోట్లతో సుమారు రెండు కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసిన ఘనత ఈ ప్రజా ప్రభుత్వమేనని ఆయన అన్నారు. అన్నిటికి మించి ఇప్పటి వరకు 50000 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద ఎన్టీఆర్ పెన్షన్ ఒకటో తేదీన ఇవ్వడం, ఒకటో తేదీ సెలవు దినం అయితే ముందు ముందు రోజే పంపిణీ చేసి వృద్ధులు దివ్యాంగులకు ఆత్మస్థైర్యం కల్పించిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని, ఆటో డ్రైవర్లకు 436 కోట్లు, 204 అన్నా క్యాంటీన్ల నిర్వహణ, మైనార్టీల సంక్షేమం కోసం 8427 కోట్లు పాస్టర్లకు ఇమామ్లకు పూజారులకు గౌరవ వేతనాలు, నాయి బ్రాహ్మణులకు 25 వేల రూపాయలు గౌరవ వేతనం, మత్స్యకార భరోసా 25 కోట్లు, నేతన్నలకు ఉచిత విద్యుత్తు కల్పించిన ప్రభుత్వమని,15,941 మెగా డీఎస్సీ 5757 కానిస్టేబుల్ నియామకాలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వందే అని అన్నారు. 175 నియోజకవర్గాల్లో ఎమ్ఎస్ఎమ్ ఈ పార్కుల ఏర్పాటు చేసి ప్రోత్సాహకాలు అందిస్తుందని, ఉత్తరాంధ్రకు మణిహారమైన విశాఖపట్నం అభివృద్ధి చెందుటకు టిసిఎస్ గూగుల్ కాగ్నిజెంట్ సంస్థలకు శంకుస్థాపన చేయడం జరిగిందని, అమరావతిలో క్వాంటంవ్యాలీ పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతూ క్రైమ్ రేట్ ని పూర్తిగా తగ్గించడం జరిగిందని, శాంతి భద్రతలకు భంగం కలిగితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కఠినంగా ఉన్నారని, ఎస్సీ ఎస్టీలకు ఉచిత సోలార్ పలకల పంపిణీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కిందని ఆయన అన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని రాష్ట్ర కేంద్ర సఖ్యతతో డబల్ ఇంజన్ సర్కార్ రానున్న 2026 సంవత్సరంలో మరింత అభివృద్ధి పథంలో ముందుకు పోతుందని, ఈ రాష్ట్ర ప్రజానీకానికి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పలాస మున్సిపాలిటీ 31 వార్డ్ ఇంచార్జి కొరికాన శంకర్ రావు, యవ్వారి మోహనరావు మాస్టర్, శాసుమాన చంద్రమౌళి, సప్ప నవీన్, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో ..
## మౌలిక వసతులకు రూ.20లక్షలు

### -అత్యవసర నిధులు మంజూరు చేసిన
### కేంద్ర పురావస్తు శాఖ



**జలుమూరు, డిసెంబరు 30(వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో రెండేళ్లుగా ఉపయోగం లేకుండా మరుగున పడిన పది వాష్‌రూములను రీమేక్ చేయడానికి కేంద్ర పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఢిల్లీ అధికారులు రూ.20 లక్షల అత్యవసర నిధులను మంజూరు చేశారు. క్షేత్రంలో కనీస మౌలిక వసతుల లేమి కారణంగా భక్తులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 18వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర పురావస్తు శాఖ ఆల్ ఇండియా డీజీ వై. ధీర్ సింగ్ రావత్‌ను స్వయంగా కలిసి శ్రీముఖలింగేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు నాయుడు గారి రాజశేఖర్ ఈ సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన డీజీ గారు, అమరావతి సర్కిల్ డైరెక్టర్ బోయకు రెండు రోజుల్లో పనులు ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత సంవత్సరం జూలై 4వ తేదీన కూడా ఇదే సమస్యపై ఆల్ ఇండియా డీజీని కలిసి, కనీస వసతులు లేకపోవడం వల్ల మహిళలు బహిర్భూమికి వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడుతోందని ప్రశ్నించినట్లు రాజశేఖర్ తెలిపారు. అప్పట్లో డీజీ ఆదేశాల మేరకు అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ శ్రీముఖలింగాన్ని సందర్శించి పనులు వేగవంతం చేయాలని చెప్పినప్పటికీ, జూలై 11న అమరావతి డైరెక్టర్ బోయ పరిశీలనకే పరిమితమై పనులు ప్రారంభం కాలేదని ఆరోపించారు. ఈ నిర్లక్ష్యం పునరావృతం కాకూడదని ఈసారి గట్టిగా హెచ్చరించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందా? శ్రీముఖలింగేశ్వర క్షేత్రానికి వచ్చిన నిధులను ఇతర క్షేత్రాలకు మళ్లించడం ఎంతవరకు సమంజసం? ప్రాచీన దేవాలయాల అభివృద్ధిని పక్కనపెట్టి స్వంత ఏజెండాతో వ్యవహరించడం సరికాదని ఆయన తీవ్రంగా విమర్శించారు. భక్తుల సౌకర్యాలు, ప్రాచీన క్షేత్రాల గౌరవాన్ని కాపాడేందుకు ఇకనైనా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆలయ ప్రధాన అర్చకులు నాయుడు గారి రాజశేఖర్ డిమాండ్ చేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546